క్లుప్తంగా

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి మృతికి నివాళి



కృష్ణమూర్తి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఆరిలోవ: ఇటీవల మృతి చెందిన సీపీఎం నాయకుడు వి.కృష్ణమూర్తి కుటుంబాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. ఆరిలోవలో కృష్ణమూర్తి ఈనెల 19న గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కృష్ణమూర్తి చిత్ర పటం వద్ద శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎం పార్టీ విశాఖలో మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. పేదలు కోసం పోరాడే వ్యక్తి అని కొనియాడారు. సీపీఎం నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఆరిలోవ జోన్ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో ఘర్షణ



గాయపడిన రమేష్

ఆరిలోవ: గంజాయి మత్తులో ఇద్దరు యువకులు ఘర్షణ పడిన ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. వారిలో ఓ యువకుడికి ముఖం, పొట్టపై స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీహెచ్.సునీల్ ఇటీవల విజయవాడ నుంచి రవీంద్ర నగర్‌లో ఉన్న తన బంధువుల ఇంటికి వచ్చాడు. అతనికి స్థానిక కుర్రాళ్లతో పరిచయం ఏర్పడింది. బుధవారం రాత్రి వారితో కలసి గంజాయి తాగాడు. ఆ మత్తులో రమేష్ అనే యువకుడితో ఏదో విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. సునీల్ చాకుతో దాడి చేయడంతో రమేష్ పొట్టా, ముఖంపైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆరిలోవ సీఐ సోమశేఖర్, సిబ్బందితో అక్కడకు వెళ్లడంతో గొడవ సద్దుమణిగింది. గాయపడిన రమేష్‌ను పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. సునీల్ పరారీలో ఉన్నాడు.

'దివాకర్ మృతి బీసీలకు తీరని లోటు'

బీచ్ రోడ్డు: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ అకాల మరణం శిష్టకరణ సామాజిక వర్గానికే కాక బీసీలకు తీరని లోటు అని రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. దివాకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

శిష్టకరణాల అభ్యున్నతికి కృషి

పక్కి దివాకర్ శిష్టకరణాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని రాష్ట్ర శిష్టకరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎన్.కె.మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. అటువంటి దివాకర్ మరణం తీవ్ర ఆందోళనకు గురిచేసిందని పేర్కొన్నారు.

16వ వార్డులో చలివేంద్రం ప్రారంభం



హెచ్‌బీ కాలనీలో చలివేంద్రం ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ ఎస్‌బీఐ వద్ద గొలగాని ప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని బుధవారం వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ప్రారంభించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకురావాలని అక్కరమాని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'తూర్పు'లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం

- సమష్టి కృషితోనే విజయం
- అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మేయర్ హరివెంకటకుమారి పిలుపు



తూర్పు నియోజకవర్గం కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో భేటీ అయిన మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: ఇప్పటి నుంచి సమష్టిగా పని చేసి వచ్చే సాధారణ ఎన్నికల్లో విశాఖ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పిలుపునిచ్చారు. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలసి ఆమె నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తూర్పులోని 15 వార్డుల అభివృద్ధి పెద్దపీట వేస్తున్నామన్నారు. చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్పొరేటర్లదేనని చెప్పారు. మరింత అభివృద్ధికి నిధులు కేటాయించనున్నామన్నారు. కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జీలు బాధ్యత తీసుకుని పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత పట్టు సాధించేలా కృషి చేయాలన్నారు. నగరంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కష్టపడి పని చేయాలన్నారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ ఓటర్లు అధికంగా ఉన్నప్పటికీ విశాఖ తూర్పు నియోజకవర్గంలో మూడు పర్యాయాలు కోల్పోయామన్నారు. రానున్న ఎన్నికల్లో విజయ ఢంకా మోగించేందుకు కలిసికట్టుగా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పదవులు కట్టబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తూర్పులో గెలిచి ఆ విజయాన్ని బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. అనంతరం అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ 2019లో ఓటమి పాలైనప్పటికీ పట్టు విడవకుండా నియోజకవర్గంలో అభివృద్ధికి నిత్యం పని చేస్తున్నామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు ముర్రువల లక్ష్మి, అక్కరమాని రోహిణి, గుడ్ల విజయసాయి, అప్పారి శ్రీవిద్య, ఉమ్మడి స్వాతి, కెల్లా సునీత, పల్లా అప్పలకొండ, గేదల లావణ్య, పార్టీ నాయకులు సత్యారెడ్డి, గిరిబాబు, సత్యనారాయణ, నాగరాజు, వార్డు ఇన్‌చార్జీలు జగ్గపల్లి జయ అప్పలరాజు, పీతల గోవింద్, సురాడ వెంకటలక్ష్మి, దాస్, పల్లా దుర్గారావు, పుక్కెళ్ల ధనలక్ష్మి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ప్రజల నీరాజనం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని
- 16వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



పథకాల గురించి వివరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల, మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 16వ వార్డులో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. పథకాలతో పొందిన లబ్ధిని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆర్థిక తోడ్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని అక్కరమాని చెప్పారు. ప్రతి పేదవాడి కళ్లల్లో ఆనందాన్ని నింపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చొల్లంగి నాగేశ్వరరావు, ఒమ్మి పోలరత్నం, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వార్డు కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

భవిష్యత్ సంపదగా మేధో హక్కులు

- ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు
- ఏయూలో ఘనంగా ఐపీఆర్ దినోత్సవం
- పేటెంట్‌లు సాధించిన మహిళలకు సత్కారం



అపరంజిని సత్కరిస్తున్న ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భవిష్యత్ తరాలకు నిజమైన సంపదగా మేధో హక్కులు నిలుస్తాయని ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా రసాయన శాస్త్ర విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ మేధో హక్కుల వేడుకల్లో ఆయన మాట్లాడారు. మనం సాధించిన పేటెంట్లను కమర్షియల్ చేయడం ఎంతో అవసరమన్నారు. తద్వారా సంపదను సృష్టించడం సాధ్యపడుతుందని, ఈ దిశగా ఆవిష్కర్తలు ఆలోచన చేయాలని సూచించారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన ఆవిష్కరణలకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన సహకారం అందిస్తోందన్నారు. పేటెంట్‌తో పాటు బ్రాండింగ్, ట్రేడ్ మార్క్ వంటివి చాలా అవసరమన్నారు. ప్రస్తుతం తమ ప్రతిభతో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. శాస్త్రీయ ఆవిష్కరణలు, పేటెంట్‌లు సాధించడంలో ప్రతిభ చూపుతున్నారన్నారు. ఎస్ఎస్‌టీఎల్ సైతం తన ప్రస్థానాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రారంభించిందని గుర్తు చేశారు.

ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ ఐపీఆర్‌పై యువతలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఐపీఆర్‌పై ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటికే ఏయూ తరపున 70 పేటెంట్లకు దరఖాస్తు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఆచార్య శ్యామల తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ నుంచి పేటెంట్‌లు సాధించిన డాక్టర్ చందన లక్ష్మి, డాక్టర్ అపరంజిలను సత్కరించారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలి

- అధికారులకు కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశం
- ఎంవీపీ కాలనీలో క్షేత్రస్థాయి పర్యటన



క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

ఎంవీపీ కాలనీ: స్థానిక రైతుబజార్‌ను ఆనుకుని ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తక్షణం తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఆయన ఎంవీపీ కాలనీ, లాసన్స్ బే కాలనీ, 19వ వార్డులో పర్యటించారు. 19వ వార్డులో మౌలిక వసతులు మెరుగుపర్చనున్నామన్నారు. వార్డులో భవన నిర్మాణ వ్యర్థాలు పెద్ద ఎత్తున గుట్టలుగా కనిపిస్తున్నాయని, పారిశుధ్య లోపం కూడా ఉందని చెప్పారు. వార్డులో వ్యర్థాల తొలగింపు విషయంలో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను కమిషనర్ ప్రశ్నించారు. క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరణ పక్కాగా జరుగుతున్నప్పుడు రోడ్ల పక్కన గుట్టలు వ్యర్థాలు ఎందుకు ఉంటున్నాయని నిలదీశారు. ఎంవీపీ కాలనీ రైతుబజార్, ఏఎస్ రాజా మైదానాన్ని ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు. అనంతరం ఆయన ఐటీ సెజ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లు కూడా అధ్వానంగా ఉంటున్నాయని అసహనం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని, తక్షణమే శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, సచివాలయ కార్యదర్శులు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్తి హక్కుల కోసం దరఖాస్తుల ఆహ్వానం



రూరల్ తహసీల్దారు రమణయ్య

ఆరిలోవ: జీవో నం.388 ప్రకారం ఇళ్ల పట్టాలు కలిగి ఉన్నవారికి పూర్తి హక్కుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని రూరల్ తహసీల్దారు సనపల రమణయ్య తెలిపారు. ఇప్పటికే ఇళ్ల పట్టాలు ఉండి రిజిస్ట్రేషన్ కాకపోవడం, దానిపై పూర్తి హక్కు లేకపోవడంతో క్రయ విక్రయాలు, జరుపుకోవడానికి వీలులేకుండాపోయిందన్నారు. ఇప్పుడు అలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దారు బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 26 నుంచి మే 25 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. అర్హులు అందుబాటులో ఉన్న సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. చినగదిలి మండలం(రూరల్) పరిధి అటు సింహాచలం, అడవివరం, ఆరిలోవతో పాటు ఇటు రుషికొండ, ఎండాడ, మధురవాడ, కొమ్మాది తదితర ప్రాంతాలలో సుమారు 4,800 పట్టాలున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయాల్లో చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి కొత్త పట్టాలు జారీ చేస్తామన్నారు. ఆ పట్టా ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని ఆయన వివరించారు. అప్పటి నుంచి పట్టాదారులు ఆ ఇంటిపై పూర్తి హక్కులు కలిగి ఉంటారన్నారు. క్రయ విక్రయాలకు, వారసులకు, సంబంధీకులకు బదిలీ చేసుకోవడానికి వీలుపడుతుందన్నారు. పట్టాలో తప్పులు ఉంటే ఆధార్ కార్డు ప్రకారం సవరణ కూడా చేస్తామన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వారికి ఇది మంచి అవకాశమన్నారు.

60 ఏళ్లు దాటిన డీఎస్సీ-98 అభ్యర్థుల ధర్నా



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

ఆరిలోవ: డీఎస్సీ-1998లో క్వాలిఫైడ్ అయి 60 సంవత్సరాలు దాటిన వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. 1998లో క్వాలిఫై అయిన తర్వాత ఇంత వరకు ఖాళీగా ఉన్నామని, ఇప్పుడు 60 సంవత్సరాలు దాటిపోవడంతో అర్హులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 60 ఏళ్లు దాటిన క్వాలిఫైడ్ అభ్యర్థులు 40 మంది ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో అభ్యర్థులు బి.సత్యనారాయణ, బి.వెంకటరమణ, టి.రామకృష్ణ, పి.ధర్మారాజు, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి సత్కారం



న్యాయమూర్తి గుత్తుల గోపిని సత్కరిస్తున్న స్మార్ట్‌సిటీ కన్జ్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: బదిలీపై వెళ్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి, డీఎల్ఎస్ఏ జడ్జి కేవీవీ బులికృష్ణను ఎంవీపీ కాలనీలోని స్మార్ట్‌సిటీ కన్జ్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ కార్యదర్శి పేర్ల భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాకు వారు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు పీకే లింగేశ్వరరావు, రమేష్ చంద్రజైన్, న్యాయవాది పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో 63 శాతం ఉత్తీర్ణత

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం సమీపం శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 63.23 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గురుకులం నుంచి 68 విద్యార్థులు పరీక్షలు రాయగా.. వారిలో 43 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జాన్ తిమోత్ 948 మార్కులు సాధించి గురుకులం టాపర్‌గా నిలవగా, వై.దీపక్ 936 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచాడన్నారు.

మొదటి సంవత్సరంలో 46.77 శాతం

ఇక్కడ ఇంటర్ మొదటి సంవత్సరంలో 46.77 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. మొదటి సంవత్సరంలో 62 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. వారిలో 29 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మొదటి సంవత్సరంలో 426 మార్కులతో పక్కి ప్రసాద్ మొదటి స్థానంలో, 423 మార్కులతో కె.అరవింద్ కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు.

హాయి.. హాయిగా జలకాలాటలలో..



కొలనులో ఏనుగులకు స్నానం చేస్తున్న మావాటి

ఆరిలోవ: రోజురోజుకూ ఎండలు తీవ్రరూపం దాల్చడంతో పెద్ద జంతువు ఏనుగూ తట్టుకోలేకపోతోంది. జూ పార్కులో నాలుగు ఏనుగులున్నాయి. వాటిలో కృష్ణ అనే వృద్ధ ఏనుగు సందర్శకులకు దూరంగా ఉంటుంది. లక్ష్మీ, సరస్వతి అనే రెండు ఆడ ఏనుగులు, రాజు అనే మగ ఏనుగు నిత్యం ఎన్‌క్లోజర్‌లో అందుబాటులో ఉంటూ సందర్శకులను అలరిస్తుంటాయి. వేసవి కారణంగా జూ అధికారులు వాటి కోసం గతంలో ప్రత్యేకంగా నిర్మించిన ఓ కొలనులో నీటిని నింపుతున్నారు. ఈ నీటి కొలనులో ఏనుగులు కొద్ది రోజులుగా జలకాలాడుతున్నాయి. తొండంతో నీటిని పీల్చుకొని వాటి శరీరమంతా తడుపుకొంటున్నాయి. కొలనులోని కొద్దిపాటి నీటిలో ఏనుగులు పొర్లుతూ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నాయి.

సంక్షేమం, అభివృద్ధే సీఎం వైఎస్ జగన్ అజెండా



యూపీహెచ్‌సీ ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, మేయర్ హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- 16వ వార్డు ఇసుకతోట యూపీహెచ్‌సీ ప్రారంభం

మద్దిలపాలెం: సంక్షేమం, అభివృద్ధే అజెండాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో రూ.99.60 లక్షల నిధులతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)ను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మితో కలిసి మంత్రి బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎంతో పారదర్శకంగా చిత్తశుద్ధితో జనరంజకమైన పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాగిస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జగనన్న పాలన చేపడుతున్నారన్నారు. అభివృద్ధి, చిత్తశుద్ధికి కేరాఫ్ అడ్రస్ సీఎం జగనన్న పాలనేనని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, పార్టీ వార్డు నాయకుడు చొల్లంగి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

7న అల్లూరి వర్ధంతి కార్యక్రమాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం, తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వచ్చే నెల 7న సాయంత్రం 5 గంటలకు ఆర్కే బీచ్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం ఎదురుగా స్వాతంత్య్ర సమరయోధుల మైదానంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇండిపెండెంట్ డైరెక్టర్ ఎస్.కాశీ విశ్వనాథరాజు, తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, సమైక్య భారతి జాతీయ సమన్వయ కర్త పి.కన్నయ్య, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బూసి వెంకటస్వామి పాల్గొన్నారు.

- అనంతరం తెలుగు విభాగం సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ బూసి వెంకటస్వామి, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త కన్నయ్య మాట్లాడుతూ అల్లూరి శత వర్ధంతి సందర్భంగా మే 7న దసపల్లా హిల్స్‌లో గాంధీ పార్క్ వద్ద ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం నిర్వహించే సమావేశం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ పెండ్యాల లావణ్య, శ్రీ ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై హర్షం



వీసీ ప్రసాదరెడ్డిని అభినందిస్తున్న పరిశోధకులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పన, విస్తరణ అభివృద్ధి కార్యక్రమాలపై పరిశోధకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డికి బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, ఎం.నరేష్ కుమార్, కె.రామారావు, వై.వెంకటనాయుడు, దంతేశ్ పట్నాయక్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో లీ ఫార్మా ఎ.లీలారాణి పాల్గొని విద్యార్థులతో కలసి ఫార్మసీ విభాగం పూర్వ భవనం వద్ద మొక్కలు నాటారు. సేవా కార్యక్రమాలలో భాగస్వాములతువున్న విద్యార్థులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యా విభాగంలో ఘనంగా వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం



ఏయూ చిహ్నానికి పూలమాల వేస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఏయూ విద్యా విభాగంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏయూ చిహ్నానికి విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు పూలమాల వేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆవిర్భావాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీవోఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ డి.నాగరాజ కుమారి, విభాగ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.